క్లుప్తంగా

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

ఒంగోలు టౌన్: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పంచాయతీ కార్మికుల వేతనాలను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలివ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి జీతాలు ఇవ్వడానికి కొన్ని జిల్లాల అధికారులు సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

అలరించిన సంగీత విభావరి

మార్కాపురం: పట్టణంలోని రీడింగ్ రూం ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రముఖ గాయకులతో ఏర్పాటు చేసిన సంగీత విభావరి శ్రోతలను అలరించింది. ప్రముఖ న్యాయవాదులు, గాయకులు పురాణం సుబ్రమణ్యం, ఝూన్సీరాణి ఆధ్వర్యంలో గాయకులు రాజకుమారి, చిన్ని, కరుణ, ఏడుకొండలు, గోపాలరావు, రమేష్, వెంకటేశ్వర్లు, తదితరులు రాగయుక్తంగా పాడారు.

యాదవ ఉద్యోగులకు సన్మానం

గిద్దలూరు రూరల్: ఈ ఏడాది ఆగస్టు 15న స్వాతంత్ర్యపు దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులను పొందిన వీఆర్‌ఓ వై.పి. రంగయ్య, ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు, హార్టికల్చరల్ ఉద్యోగి మోహనక్రిష్ణలను పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం యాదవ ఎంప్లాయీస్ అసోసియేషన్ వారు సన్మానించారు. వారి సేవలను పలువురు యాదవ సంఘం నాయకులు మొర్రిపిచ్చయ్య యాదవ్, ఓ.వెంకటయ్యలతో పాటుగా పలువురు వారిని కొనియాడారు.

స్నేహం.. అ'పూర్వ'ం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదివిన 32 మంది స్నేహితులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. చదువు చెప్పిన గురువులు దోర్నాల వరమ్మ, బరిగె నరసింహరావు, కేఎస్‌ఆర్, లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి చొరవ చూపిన వై.మాల్యాద్రి, వి.రాంబాబు, సీహెచ్ అర్జున్, ఎం.శ్రీనివాసరావు తదితరులను స్నేహితులంతా అభినందించారు.

ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లమల అభయారణ్యం బోడేనాయక్ తండాలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనులను హైదరాబాద్‌కు చెందిన ప్రస్థాన సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టర్ మద్దెల లక్ష్మీసతీష్ ఆదివారం చేపట్టారు. ఆదివారం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి 4 లక్షల రూపాయలతో ఆలయ గోపురం పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇనుపకోళ్ల కిరణ్‌కుమార్, రఘుపతి సతీష్ నాయుడు, షేక్ అబ్దుల్ మజీద్, జెడ్పీటీసీ సభ్యురాలు డుమావత్ లతా చంద్రకాంత్, చంద్రకాంత్ నాయక్, ఒంటేరు నాగేశ్వరరావు, దూదేకుల రసూల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమల వ్యాధులపై అవగాహన

పెద్దదోర్నాల: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో కార్యక్రమాలను నిర్వహించారు. చింతల డాక్టర్ ఎం.యాగ్నిక్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. డివిజన్ సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, మలేరియా సూపర్‌వైజర్ ఇజ్రాయిల్, బీసీ హాస్టల్ వార్డెన్ కె.లక్ష్మీనాయక్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ డి.లక్ష్మీనాయక్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ టీచర్ తులసి నాయక్, ఏఎన్‌ఎం కే.నాగలక్ష్మీ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వెంకట్రావు మరణాన్ని జీర్ణించుకోలేకున్నా...

- రెండోసారి కూడా మీనాకుమారికే ఒడా ఛైర్మన్ పదవి
- వెంకట్రావు కుటుంబ బాధ్యతలు నా తర్వాత కూడా నా కుమారుడు చూస్తాడు
- ఇది నా బాధ్యతగా భావిస్తున్నా
- సింగరాజు వెంకట్రావు జయంతి కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వేదికపై ప్రణీత్‌రెడ్డి, మీనాకుమారి, తదితరులు

ఒంగోలు: సింగరాజు వెంకట్రావు లేరన్న విషయాన్ని నేటికీ తట్టుకోలేకపోతున్నానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి గద్గద స్వరంతో పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక బండ్లమిట్ట జంక్షన్‌లో సింగరాజు వెంకట్రావు యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెంకట్రావు జయంతి కార్యక్రమానికి బాలినేని శ్రీనివాసరెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ 1999 ఎన్నికల్లో తన వెన్నంటి ఉన్న ప్రభాకరరెడ్డి ఆకస్మికంగా మరణించారన్నారు. నేటికీ అతని కుటుంబంతో మా కుటుంబానికి ఎనలేని అనుబంధం ఉందన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా తాను తప్పకుండా పరిష్కరిస్తున్నానన్నారు. అదే విధంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి తన వెన్నంటి ఉంటూ పార్టీ గెలిచిన తర్వాత మంచి పదవి ఇద్దామనుకునేలోపే వెంకట్రావు భౌతికంగా దూరం కావడం బాధగా ఉందన్నారు. తన హృదయంలో వెంకట్రావు ఉన్నాడని అందరూ అంటుంటారని, కానీ, వెంకట్రావు హృదయంలోనే నాకు స్థానం దక్కిందని భావిస్తానని అన్నారు. మొదట వెంకట్రావు భార్య సింగరాజు మీనాకుమారికి ఒడా ఛైర్మన్ పదవి ఇస్తానని, రెండోసారి మరో నాయకునికి ఇస్తానని హామీ ఇచ్చానన్నారు. సింగరాజు వెంకట్రావు జీవించి ఉంటే వెంకట్రావును ఒప్పించి ఉండేవాడినని, కానీ, ఇప్పుడిప్పుడే జనంలోకి వస్తున్న మీనాకుమారికి ధైర్యం కల్పించేందుకు మరోసారి కూడా ఆమెకే ఒడా ఛైర్మన్ పదవి ఇప్పిస్తానని బాలినేని ప్రకటించారు. తాను హామీ ఇచ్చిన నాయకుడికి తప్పకుండా సీఎంతో మాట్లాడి మరో మంచి పదవి ఇప్పిస్తానని తెలిపారు. మీనాకుమారి కూడా 2024 ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషిచేయాలని కోరారు. అనంతరం మీనాకుమారి మాట్లాడుతూ వెంకట్రావుపై ఉన్న ప్రేమతో ఇంతదూరం వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. 2019 ఎన్నికల్లో బండ్లమిట్ట యువతతో కలిసి వాసన్న గెలుపునకు వెంకట్రావు కృషిచేశారని, ఎంతమంది ఎన్నిఅన్నా పట్టించుకోకుండా ఒక సైన్యంలా పనిచేసి వాసన్న గెలుపులో భాగస్వాములయ్యారని గుర్తుచేశారు. వారంతా నేడు వెంకట్రావు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం చూస్తుంటే.. ఆయన లేనందుకు ఒకవైపు బాధగా ఉన్నా.. మరోవైపు ఇంతమంది మనసుల్లో ఒక మంచి స్థానం సంపాదించుకున్నారన్న తృప్తి కలుగుతుందన్నారు. వాసన్న తానే కాకుండా తన తర్వాత కూడా మా కుటుంబానికి అండగా ఉండేందుకు ఆయన కుమారుడికి బాధ్యతలు అప్పగించానని ప్రకటిస్తుంటే.. నా కళ్లలో నీళ్లు ఆగలేదని ఆమె అన్నారు. వాసన్న గెలుపునకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని, వెంకట్రావు ఆశయాన్ని నెరవేర్చేందుకు పాటుపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కావటి రవి వ్యవహరించగా, వైఎస్సార్ సీపీ యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, అయినాబత్తిన ఘనశ్యాం, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు షేక్ బమీరావలి, ఏపీ టైలర్ల వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ మస్తాన్‌బీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాబు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, వైఎస్సార్ సీపీ ఒంగోలు మండల అధ్యక్షుడు రాయపాటి అంకయ్య, పలువురు కార్పొరేటర్లు పాల్గొని వెంకట్రావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం సింగరాజు వెంకట్రావు యూత్‌ఫోర్స్ వెంకీ మామ అంటూ ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను మీనాకుమారితో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి కట్ చేశారు. సింగరాజు వెంకట్రావు ఆత్మకు శాంతికలగాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రణీత్‌రెడ్డి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు సబర్బన్: నగరంలోని త్రోవగుంటలో పలు అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. త్రోవగుంట ఎస్సీకాలనీలో రూ.39 లక్షలతో జరుగుతున్న శ్మశాన వాటికి అభివృద్ధి పనులను పరిశీలించారు. త్రోవగుంట పాఠశాలలో రూ.53 లక్షలతో జరుగుతున్న నాడు–నేడు అభివృద్ధి పనులు, మరో రూ.28 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. రూ.కోటితో జరుగుతున్న అర్బన్ హెల్త్ సెంటర్ పనులను కూడా ప్రణీత్‌రెడ్డి పరిశీలించారు. పనులు వేగంగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. 50వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరును కార్పొరేటర్ అంబటి ప్రసాదును అడిగి తెలుసుకున్నారు. ప్రణీత్‌రెడ్డి వెంట 1వ డివిజన్ కార్పొరేటర్ కోటపూరి సామ్రాజ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకరరావు, గోపి, సాంబయ్య, తదితరులు ఉన్నారు.

నోరు జారితే ఊరుకోం

- రాజేష్‌ను హెచ్చరించిన పెద్దిపోగు కోటేశ్వరరావు


విజయసాయిరెడ్డి నుంచి నియామకపత్రం అందుకుంటున్న కోటేశ్వరరావు

ఒంగోలు: సామాజిక మాధ్యమాలను వేదికగా చేసి విజయసాయిరెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని రాజేష్‌ను ఏపీ లేబర్ బోర్డు సభ్యుడు పెద్దిపోగు కోటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం ఒంగోలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడారు. విజయసాయిరెడ్డి తమ గురువని, అసత్య ఆరోపణలతో ఆయనను విమర్శిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. రాజేష్ చరిత్ర ఏంటో తమకు తెలుసన్నారు. మరో మారు ఇష్టం వచ్చినట్లు చెలరేగితే విజయవాడ వచ్చి ధర్నా చేస్తామన్నారు. తనకు లేబర్ బోర్డు సభ్యునిగా అవకాశం కల్పించిన విజయసాయిరెడ్డి చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకోవడం ఆనందంగా ఉందంటూ విజయసాయిరెడ్డికి కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు ఏకగ్రీవం


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న విజయలక్ష్మి


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సురేష్‌బాబు

- పంచాయతీ వార్డుల ఉప ఎన్నికల్లో విజయం

ఒంగోలు: మండలంలోని రెండు పంచాయతీల్లో రెండు వార్డు మెంబర్ పదవులకు శనివారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొద్దులూరివారిపాలెంలో ఒకటో వార్డు మెంబర్ పదవికి చప్పిడి సురేష్‌బాబు మినహా ఇతరులెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకోగా, ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చుండూరి రవిబాబు పాల్గొన్నారు. అదేవిధంగా దేవరంపాడు పంచాయతీలో 2వ వార్డు మెంబర్ పదవికి జరిగిన ఉప ఎన్నికల్లో సాగి విజయలక్ష్మి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆమె కూడా ఏకగ్రీవంగా ఎన్నికై ఎన్నికల అధికారి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. వీరిద్దరూ వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది.

వైభవంగా చెన్నమల్లేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులు


స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ముండ్లమూరు: మండలంలోని జమ్మలమడకలో నూతనంగా నిర్మించిన చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. బూచేపల్లి సుబ్బారెడ్డి – వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్, బూచేపల్లి శివప్రసాదరెడ్డి ధర్మపత్ని నందిని ఆధ్వర్యంలో అన్న ప్రాస వితరణ కార్యక్రమం జరిగింది.

మా భూమిని మేము కాపాడుకోవడం తప్పా..?

- కూరగాయల వ్యాపారిణి ప్రభావతి


మీడియాతో మాట్లాడుతున్న ప్రభావతి

ఒంగోలు: దశాబ్దాలుగా కూరగాయల మార్కెట్లో వ్యాపారం చేసుకుంటూ వైఎస్సార్ సీపీపై అభిమానంతో పార్టీలో కొనసాగుతున్నంత మాత్రాన మా భూములను కబ్జా చేస్తుంటే చూస్తూ కూర్చోవాలా అంటూ స్థానిక దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్లో హోల్‌సేల్ వ్యాపారిణి పురిణి ప్రభావతి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక తన దుకాణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పూర్వీకులకు పేర్నమిట్ట పంచాయతీ సర్వే నెంబర్ 190/2లో రెండెకరాలు పొలం ఉందన్నారు. ఆ పొలం తన తండ్రి తదనంతరం తనకు వచ్చిందని తెలిపారు. ఆ భూమిని ఇటీవల మన్నెం నరసింహారావు చౌదరి అనే వ్యక్తి ప్రోత్సాహంతో మినిశెట్టి శ్రీనివాసరావు, మరికొంతమంది ఆక్రమించేందుకు వెళ్లారన్నారు. ఈ విషయం తెలిసి తాను ఫెన్సింగ్ వేసుకుంటే దానిని కూడా ధ్వంసం చేశారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి తమను ఇబ్బందులు పెడుతున్నట్లు స్పష్టంగా చూపినా పోలీసులు వేగవంతంగా స్పందించకపోవడంతో తన భూమిని తాను కాపాడుకునే యత్నంలో భాగంగా కోర్టును ఆశ్రయించి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నట్లు పేర్కొన్నారు. దానిని ధ్వంసం చేస్తామని, అడ్డం వస్తే చంపేస్తామని కూడా తనకు హెచ్చరికలు రావడంతో ఆ విషయాన్ని కూడా పోలీసులకు తెలియజేశానని, అయినా వారు లెక్కచేయకుండా తన ఇంజెక్షన్ ఉత్తర్వులను తెలియజేస్తూ వేసిన బోర్డుతోపాటు ఫెన్సింగ్‌ను కూడా ధ్వంసం చేశారన్నారు. దీనిపై తాను మరలా పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ఈ నేపథ్యంలో మహిళగా నా ప్రాణాలను, నా భూమిని కాపాడుకునే క్రమంలో భాగంగా కోర్టును ఆశ్రయిస్తే దానిపై నేనే దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు పచ్చపత్రికల్లో కథనాలు వండివార్చడం ఏపాటి జర్నలిజమంటూ ప్రభావతి ప్రశ్నించారు. వాస్తవం తెలుసుకోకుండా ఇలాంటి కథనాలు రాయడం సరికాదన్నారు. కేవలం వైఎస్సార్ సీపీపై ఉన్న అభిమానంతో ఆ పార్టీలో ఉన్నంత మాత్రాన తనపై భూకబ్జా ఆరోపణలు చేయడం తగదని ఆమె స్పష్టం చేశారు.

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సురేష్


అనిల్ దంపతులను అభినందిస్తున్న మంత్రి సురేష్, నాయకులు

మద్దిపాడు: స్థానిక ఎస్సీకాలనీలో ఆదివారం జరిగిన పాటిబండ్ల అనిల్ వివాహానికి రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనిల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, నాయకులు మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, యేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, పల్లకి సత్యన్నారాయణరెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ జిల్లా అధ్యక్షుడు నర్రా సురేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై అనిల్ దంపతులకు అభినందనలు తెలిపారు.

అంకాళమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో అంకాళమ్మ


ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో గ్రామ ప్రజల ఇలవేల్పు అయిన అంకాళమ్మకు ఆదివారం గ్రామస్తులు పూజలు చేశారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం ప్రాంత ప్రజల గ్రామదేవత అల్లూరి పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం కావటంతో పట్టణ ప్రజలతో పాటు వేముల కోట, సీతనాగులవరం, రామచంద్రపురం తదితర గ్రామాల నుంచి భక్తులు కుంకుమ బండ్లు కట్టుకుని వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. నాగమయ్య శిలలకు, నాగమయ్య పుట్టకు పాలు పోసి పూజలు చేశారు. ఈవో చెన్నకేశవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

1,500 ఎకరాల్లో ఈ క్రాప్ బుకింగ్


పొలంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న ఏవో మోహన్‌రెడ్డి (ఫైల్)

కొత్తపట్నం: మండలంలో 1,500 ఎకరాల్లో సాగుచేస్తున్న వ్యవసాయ పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు వ్యవసాయశాఖ ఏవో మోహన్‌రెడ్డి తెలిపారు. మిగిలిన 400 ఎకరాల నమోదును సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. వేరుశనగ, చామ, ఆకుకూరలు, కూరగాయలు, కొబ్బరితోటలు, మిర్చి పంటలకు ఈ క్రాప్ ప్రక్రియ జరుగుతోందన్నారు. రైతులందరూ ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు నష్టపోతారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకోవచ్చని అన్నారు. డీఏపీ, యూరియా, 10–26–26 రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతానికి రంగాయపాలెం, రాజుపాలెం, అల్లూరు, మోటుమాల, ఈతముక్కల, గమళ్లపాలెం రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ కార్డు తీసుకుని ఎరువులు తీసుకోవచ్చన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

500 మంది పేదలకు ఆహారం అందజేత

మార్కాపురం టౌన్: యువ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేకరించిన ఆహారాన్ని పట్టణంలోని కొండారెడ్డి కాలనీ, ఎన్‌ఎస్ నగర్‌లో ఉంటున్న సుమారు 500 మంది పేదలకు అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు ఆరీపుద్దీన్ తెలిపారు. మార్కాపురం, గిద్దలూరు, బేస్తవారిపేట ప్రాంతాల్లో శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని తాము సేకరించి పేదలకు అందించామన్నారు. ఎక్కడైనా ఆహారం మిగిలితే వృథా చేయకుండా 7386642536కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గుంటిగంగా భవానికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు 10 చీరెలు సమర్పించారు. ఆలయానికి 6905 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ ఏబీ భాస్కరరెడ్డి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం


గ్రామోత్సవం నిర్వహిస్తున్న కాటంవారిపల్లె గ్రామస్తులు

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లెలో వేంచేసి ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యం తయారు చేసి, చిన్న ప్రభను నిర్మించి గ్రామోత్సవం చేశారు. అనంతరం అమ్మవారికి పొంగళ్లు సమర్పించి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.